క్లుప్తంగా

శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే



తిరుమల కొండపై ఎమ్మెల్యే తదితరులు

పరిగి: ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి సోమవారం తిరుమలలో సందడి చేశారు. కార్యకర్తలతో కలిసి తిరుపతికి వెళ్లిన ఆయన.. శ్రీవారిని దర్శించుకొని, మొక్కులు చెల్లించుకున్నారు.

చెన్నారెడ్డి అంత్యక్రియల్లో ప్రముఖులు



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి

కొడంగల్: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చెన్నారెడ్డి అంత్యక్రియల్లో ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి పాల్గొన్నారు. చెన్నారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తిరుపతిరెడ్డి, పీసీసీ సభ్యుడు మహ్మద్ యూసుఫ్, మండల కమిటీ అధ్యక్షుడు ప్రశాంత్‌లు చెన్నారెడ్డి పాడె మోశారు. బీఆర్‌ఎస్ మండల కమిటీ అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, నాయకులు వెంకటయ్య గౌడ్, మధు, నయీమ్, ఆసీఫ్‌ఖాన్ ఉన్నారు.

ప్రచారం సరికాదు

గెలుపే లక్ష్యంగా పనిచేస్తాం: నరేష్



బీజేపీ నాయకుడు నరేష్ మహరాజ్

తాండూరు: డీసీసీబీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి తాండూరు అసెంబ్లీ బీజేపీ అభ్యర్థినంటూ ప్రకటించుకోవడం సరికాదని మాజీ మంత్రి చందుమహరాజ్ తనయుడు, బీజేపీ నాయకుడు నరేష్ మహరాజ్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థుల పేర్లను పార్టీ ప్రకటించలేదని, కానీ ఇటీవలే బీఆర్‌ఎస్ పార్టీ నుంచి బీజేపీలో చేరిన లక్ష్మారెడ్డి టికెట్ తనకే వస్తుందంటూ ప్రచారం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. అలా ప్రచారం చేసుకోవడం మంచిది కాదని హితవు పలికారు. ఇక్కడ నాతో పాటు మరో ఇద్దరు బీసీ నాయకులు టికెట్ ఆశిస్తున్నారని, టికెట్ ఎవరికి వచ్చినా పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని చెప్పారు.

వరద బాధితులకు సామగ్రి పంపిణీ



నిత్యావసరాలను అందజేస్తున్న యువకులు

కుల్కచర్ల: ములుగు జిల్లా వరద బాధితులకు సేవలందించేందుకు యువత ముందుకు వచ్చింది. చౌడాపూర్ మండలం మందిపల్ గ్రామ యువకులు, వీఫర్ యూత్ యువజన సభ్యులు సంటి అజయ్, సింగరమోని శ్రీకాంత్, ప్రేంకుమార్, మధన్‌కుమార్ సోమవారం పస్ర, మేడారం, నార్లపూర్ గ్రామాల్లో ప్యూర్ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాధితులకు నిత్యవసరాలు, వస్త్రాలు తదితర సామగ్రిని పంపిణీ చేశారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

దౌల్తాబాద్: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఎంపీపీ విజయ్‌కుమార్ అన్నారు. సోమవారం దౌల్తాబాద్ మండలం ఇందాపూర్‌లో రూ.5లక్షలతో ఫార్మేషన్ రోడ్డు, దేశాయిపల్లిలో రూ.20లక్షలతో జీపీ భవన నిర్మాణానికి భూమిపూజ చేసి మాట్లాడారు. ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి కృషితో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేశామని, మిగిలిన పనులు కూడా పూర్తి చేస్తామన్నారు. జెడ్పీటీసీ మహిపాల్, వైస్‌ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, ఎంపీటీసీ జనార్దన్‌గౌడ్ ఉన్నారు.

గద్దర్ మృతి తీరని లోటు

- ప్రజాసమస్యలపై కదం తొక్కిన యుద్ధనౌక
- ఆటపాటలతో జనం గుండెల్లో నిలిచిన కళాకారుడు: వక్తలు



కొడంగల్ రూరల్: గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అంబేడ్కర్ సంఘం నాయకులు

కొడంగల్ రూరల్: 'మా రాష్ట్రం మాకే కావాలి' అనే నినాదంతో పదంపదం కలిపి కాలికి గజ్జెకట్టి కదం తొక్కిన ప్రజాగాయకుడు గద్దర్ అని అంబేడ్కర్ సంఘం నాయకులు అన్నారు. సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో అంబేడ్కర్ యువజన సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు రమేష్‌బాబు, పట్టణ అధ్యక్షుడు చంద్రశేఖర్, డీబీఎస్‌యూ సాయిలు, పలు సంఘాల ఆధ్వర్యంలో గద్దర్ మృతికి సంతాపంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడారు. ఎంతో మంది కళాకారులకు గద్దర్ పురుడుపోశారని, తన ఆట, పాట, మాటలతో ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. సంఘం నాయకులు అన్నారం సాయిలు, చిన్నయ్య, చంద్రశేఖర్, జి.ప్రవీణ్, లక్ష్మణ్, కనకప్ప, అనంతయ్య పాల్గొన్నారు.

అణగారిన వర్గాల అభ్యున్నతికి..

యాలాల: ప్రజాసమస్యలపై కదం తొక్కిన యుద్ధనౌక గద్దర్ అని ప్రజాసంఘాల నాయకులు అన్నారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గద్దర్ మరణం తీరని లోటన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భీమప్ప, సీపీఎం మండల కార్యదర్శి బుగ్గప్ప, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్కయ్య ఉన్నారు.

కుల్కచర్లలో..

కుల్కచర్ల: గాయకుడు, కవి, యుద్ధ నౌకగా పేరుగాంచిన గద్దర్ మృతిపట్ల పలువురు సంతాపం తెలుపుతూ.. ఆయన చిత్రపటానికి పాలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మట్లాడారు. తన గళంతో చేసిన స్ఫూర్తిదాయక పోరాటం నేటి యువతరానికి ఆదర్శమన్నారు. కార్యక్రమంలో స్థానిక నేతలు ఎల్పాటి అశోక్ కుమార్, చిలకల శంకర్, వెంకటేశ్, బాలరాజ్, కిషన్ నాయక్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పరిగిలో..

పరిగి: ప్రజాగాయకుడు గద్దర్ మృతి తీరనిలోటని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ కుమార్ ముదిరాజ్ అన్నారు. పరిగి పట్టణం ప్రధాన చౌరస్తాలో గద్దర్ మృతికి సంతాపం తెలుపుతూ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో గద్దర్ కృషి ఎనలేనిదని పేర్కొన్నారు.



యాలాల: గద్దర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



కుల్కచర్లలో..



పరిగిలో.. బీఆర్‌ఎస్ నేతలు

ఆధ్యాత్మిక భావాలతో ఏకాగ్రత

- కథల రూపంలో విద్యార్థులకు బోధించాలి
- హిందూ ధర్మ ప్రచార పరిషత్ ప్రతినిధి గూడూరు హరినాథ్



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న టీటీడీ ధార్మిక సభ్యులు తదితరులు

తాండూరు టౌన్: చిన్ననాటి నుంచే విద్యార్థుల్లో ఆధ్యాత్మిక భావనను పెంపొందించాలని హిందూ ధర్మ ప్రచార పరిషత్ ప్రతినిధి గూడూరు హరినాథ్ అన్నారు. పరిషత్ ఆధ్వర్యంలో తిరుమల తిరుపతి దేవస్థానం సౌజన్యంతో సోమవారం స్థానిక నేతాజీ గురుదేవ్ గురుకుల్ పాఠశాలలో విద్యార్థులకు 'కథ చెబుతారా, ఊ కొడతాం' పేరుతో కథల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆధ్యాత్మికత అనేది విద్యార్థుల్లో ఏకాగ్రత, క్రమశిక్షణ, దైవ భక్తిని పెంపొందిస్తుందని పేర్కొన్నారు. రామాయణం, మహాభారతం, భాగవతం, భగవద్గీత వంటి గ్రంథాల్లోని సారాంశాన్ని విద్యార్థులు అర్థం చేసుకునే విధంగా కథల రూపంలో తల్లిదండ్రులు చెప్పాలి, ఉపాధ్యాయులు బోధించాలని సూచించారు. 10 నుంచి 15 ఏళ్ల వయసు విభాగంలో ప్రథమ బహుమతి వైష్ణవి (నేతాజీ), ద్వితీయ బహుమతి శ్రీనిధి (శివం గ్రామర్), తృతీయ బహుమతి వర్షిత (విశ్వవేద) సాధించారు. అలాగే 5 నుంచి 10 ఏళ్ల విభాగంలో ప్రథమ బహుమతి ప్రహర్ష (నేతాజీ), ద్వితీయ బహుమతి మోక్ష (గంగోత్రి), తృతీయ బహుమతి ఆరాధ్య (సంస్కార్ విద్యాపీఠ్) గెలుచుకున్నారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు నేతాజీ స్కూల్ డైరెక్టర్ మణిమాల, ప్రిన్సిపల్ శివలీల, పలు పాఠశాలల డైరెక్టర్లు రవీందర్ రెడ్డి, కవిత, శశిధర్ రెడ్డి, టీటీడీ ధార్మిక సభ్యులు తదితరులు బహుమతులు ప్రదానం చేశారు.

వసతి గృహాల సమస్యలు పరిష్కరించాలి

బీసీ సంఘం మండల అధ్యక్షుడు లక్ష్మణాచారి



విద్యార్థులతో మాట్లాడుతున్న సంఘం నాయకులు

యాలాల: బీసీ బాలుర, బాలికల వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని బీసీ సంఘం యాలాల మండల అధ్యక్షుడు చెన్నారం లక్ష్మణచారీ డిమాండ్ చేశారు. సోమవారం బీసీ సంఘం నాయకులతో కలిసి వసతి గృహాన్ని సందర్శించి మాట్లాడారు. బాలికల హాస్టల్లో విద్యార్థుల సంఖ్యకనుగుణంగా గదులు లేక ఇబ్బంది పడుతున్నారని, మినరల్ వాటర్ ఉండేలా చూడాలని కోరారు. బాలుర వసతి గృహం సందర్శించి, పరిసరాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడగా.. సమస్యల గురించి నాయకులకు వివరించారు. మరుగుదొడ్లు సరిగా లేవని, తాగునీటికి ఇబ్బందిగా ఉందని చెప్పారు. వానలకు పైకప్పు కురుస్తుండటంతో గోడలు తడుస్తున్నాయన్నారు. గదుల్లో ఫ్యాన్లు సరిగా లేవని, కిటికీలకు దోమతెరలు లేకపోవడంతో దోమలు కుడుతున్నాయని తెలపగా.. సమస్యలు పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కోరారు. నాయకులు బస్వరాజ్, ప్రకాష్, భిక్షపతి, నర్సింహ్మా, అన్వర్, సమీర్ ఉన్నారు.

పత్రాలతో ఫిర్యాదు చేయండి

తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి



రైతుల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న తహసీల్దార్

మోమిన్‌పేట: భూ సమస్యలకు సంబంధించిన పూర్తి డాక్యుమెంట్లతో ఫిర్యాదు చేయాలని తహసీల్దార్ మనోహర్ చక్రవర్తి చెప్పారు. సోమవారం తహసీల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో రైతుల నుంచి పలు అర్జీలను స్వీకరించి మాట్లాడారు. రైతులు తమ భూ సమస్యల పరిష్కారం కొరకు తగిన డాక్యుమెంట్లను ఫిర్యాదుకు జతపర్చాలని, సమస్యలను చెప్పే ముందు పూర్తి అవగాహనతో రావాలని ఆయన సూచించారు. ఫిర్యాదులో పేర్కొన్న విధంగా మీ సేవలో దరఖాస్తు చేయాల్సి ఉంటుందని ఆయన వెల్లడించారు. ధరణి సమస్యలను మీ సేవలో దరఖాస్తు చేసి, తగిన ఆధారాలను తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు.

ఆర్థికాభివృద్ధి సాధిస్తేనే మనుగడ



ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న నర్మద కిష్టప్ప

కొడంగల్: రాష్ట్రంలో బహుజనులకు రాజ్యాధికారం రావాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి అంగడిరాయిచూర్ నర్మద కిష్టప్ప అన్నారు. సోమవారం కొడంగల్ మండలం టేకుల్‌కోడ్‌లో నూతనంగా గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జనాభాలో అత్యధికంగా ఉన్న బహుజనులకు బీఎస్పీ 70 అసెంబ్లీ సీట్లు ఇస్తుందని తెలిపారు. చట్ట సభల్లో ప్రాతినిధ్యం లేని కులాలకు ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ,బీసీ మైనార్టీ వర్గాలకు మేలు జరుగుతుందని, అన్ని వర్గాల ప్రజలు ఆర్థికాభివృద్ధి సాధిస్తేనే మనుగడ ఉంటుందన్నారు. టేకుల్‌కోడ్ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా బుర్రి లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు కంతి మలక్కప్ప, ప్రధాన కార్యదర్శి చిట్లపల్లి రాములు, కార్యదర్శులుగా రాజు, పున్నం చంద్‌లను నియమించారు. కార్యక్రమంలో అన్నారం సాయిలు, రవి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

మర్పల్లి: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1994–95లో విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు సోమవారం పాఠశాల ప్రాంగణంలో సందడి చేశారు. నాటి మిత్రులు, విద్యాబుద్ధులు నేర్పిన గురువులు ఒకరిని ఒకరు ఆప్యాయంగా పలకరించుకొని, యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పేదరికంలో ఉన్న తోటి స్నేహితులకు.. స్థిరపడిన మిత్రులు ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం ఉపాధ్యాయులు రుక్మయ్య, సర్దార్‌మియా, సత్యనారాయణను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అన్నపూర్ణ, ప్రవీణ, మానికేశ్వరీ, కరుణాకర్, రవి, విజయ్, దేవ్యనాయక్, జైహింద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముర్రుపాలలో వ్యాధి నిరోధక శక్తి

- తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం
- ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు



మోమిన్‌పేట: సమావేశంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ పుష్పలత

మోమిన్‌పేట: ముర్రుపాలలో వ్యాధి నిరోధక శక్తి అధికంగా ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పలత చెప్పారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం మోమిన్‌పేట మండలం మొరంగపల్లిలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి తల్లి బిడ్డ పుట్టగానే ముర్రుపాలను పట్టించాలని సూచించారు. గతంలో మన పెద్దలు తేనెను శిశువు నాలికపై రుద్దే వారని, అలా కాకుండా తల్లిపాలు పట్టాలని చెప్పారు. దీంతో ఆరు రోగాల నుంచి బిడ్డ రక్షణ పొందుతుందని ఆమె పేర్కొన్నారు. ఆరు నెలల వరకు తల్లి పాలను తాగించాలని, ఆ తర్వాత అన్నం పెట్టాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పులు చేసుకుంటే తల్లి బిడ్డకు క్షేమమని తెలిపారు. కార్యదర్శి మాధవి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, తల్లులు పాల్గొన్నారు.

అపోహలు వద్దు

యాలాల: అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టాలని, ఈ విషయంలో మహిళలకు ఎలాంటి అపోహలు వద్దని ఐసీడీఎస్ సిబ్బంది చెప్పారు. తల్లి వారోత్సవాల్లో భాగంగా జీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల నుంచి గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందజేస్తున్నామని చెప్పారు. సర్పంచ్ సిద్రాల సులోచన మాట్లాడుతూ తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమన్నారు. అనంతరం పలువురు బాలింతలను సన్మానించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఉజ్వలరాణి, మీనాక్షి, టీచర్లు మంజుల, అమరవేణి, భాగ్యలక్ష్మి, భారతమ్మ, సౌభాగ్యలక్ష్మి, నిర్మల, కవిత, లక్ష్మీ, హేమలత ఉన్నారు.

తల్లి పాలు అమృతం

తాండూరు టౌన్: తల్లిపాలు బిడ్డకు అమృతం లాంటివని 20వ వార్డు బీఆర్‌ఎస్ కౌన్సిలర్ సంగీతా ఠాకూర్ అన్నారు. గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రసవం తర్వాత తల్లి నుంచి వచ్చే ముర్రుపాలు బిడ్డకు ఎంతో శక్తినిస్తాయని, వ్యాధి నిరోధక శక్తిని పెంచే ప్రొటీన్లు, విటమిన్లు అందులో ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ రాధ, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

రెండేళ్ల వరకు..

బంట్వారం: తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యకరమని ఐసీడీఎస్–సీడీపీఓ కాంతారావ్ అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పుట్టిన బిడ్డకు గంటలోపు తల్లిపాలు పట్టాలని చెప్పారు. ఆరు నెలల తర్వాత అదనపు ఆహారంతో పాటు రెండేళ్ల వరకు తల్లి పాలను తాగించాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ ధనలక్ష్మి, సీహెచ్‌ఓ విజయ్‌కుమార్, స్థానిక సర్పంచ్ లావణ్య, గర్భిణులు, బాలింతలు, తల్లులు, కిశోర బాలికలు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.



యాలాల: తల్లిపాల వారోత్సవాల వాల్‌పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

అనాథ విద్యార్థులకు ఆర్థిక సాయం

బొంరాస్‌పేట: నిరుపేద విద్యార్థుల చదువుకు కిసాన్‌బంధు సేవాసంస్థ ఆర్థిక సహాయం అందజేసింది. సోమవారం బొంరాస్‌పేట మండలం రేగడిమైలారంలో టీవీవీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మండలానికి చెందిన సిద్దు అరుణ కుటుంబానికి రూ.14వేలు, ఫసులోద్ది గ్రామానికి చెందిన లావణ్య, గోవిందమ్మ కుటుంబానికి రూ.12వేలు సాయం చేశారు. ఇందులో టీవీవీ నాయకులు రవీందర్‌గౌడ్, బాకారం చంద్రశేఖర్, అనిల్‌కుమార్, విజయలక్ష్మి, లక్ష్మి, శ్రీప్రియ, శశివర్ణ, టీజేఏసీ నాయకులు గౌరారం గోపాల్, హెచ్ఎం పాపిరెడ్డి, అబ్దుల్ మోయిన్ హఖ్, సర్పంచు, ఉపాధ్యాయులు ఉన్నారు.

మహిళల భద్రతే షీటీం లక్ష్యం



మాట్లాడుతున్న సీఐ

అనంతగిరి: వికారాబాద్ పట్టణం సెయింట్ ఆంథోని పాఠశాలలో సోమవారం షీటీంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా టౌన్ సీఐ శీను మాట్లాడారు. యువతి, మహిళల భద్రతే షీటీం లక్ష్యమన్నారు. ఎవరైనా ఏదైనా ఆపద సమయంలో ఉంటే డయల్ 100, 181, 1930లకు ఫోన్ చేయాలని సూచించారు. ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు షీటీం బృందం తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబాన్ని ఆదుకుంటాం



బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న ఆర్ఎస్ఐ రమేశ్

దోమ: రోడ్డు ప్రమాదంలో ఆదివారం రాత్రి మృతి చెందిన హోంగార్డు కుటుంబాన్ని తాము అన్ని విధాలుగా ఆదుకుంటామని సైబరాబాద్ హెడ్ క్వాటర్స్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డులు చెప్పారు. సోమవారం కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఆదేశాల మేరకు గౌస్ మృత దేహానికి నివాళులర్పించామని తెలిపారు. హోంగార్డు వెల్ఫేర్ ఫండ్ నుంచి అంత్యక్రియల నిమిత్తం ఆర్ఎస్ఐ రమేశ్, హెడ్ కానిస్టేబుల్ యాదయ్య, హోంగార్డులు గోపాల్, సంగమేశ్, జమాల్‌ఖాన్‌లు బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

అనంతగిరి: మున్సిపాలిటీలో కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేస్తున్న కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని తెలంగాణ మున్సిపల్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మైపాల్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట కార్మికులు చేపట్టిన ధర్నాలో పాల్గొని మాట్లాడారు. కార్మికులను పర్మినెంట్ చేయడంతో పాటు కనీస వేతనం అమలు చేయాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించి, ప్రమాద బీమా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిటీ నాయకులు బుచ్చయ్య, శంకర్, లక్ష్మి, అనసూయ, సాయికుమార్, వెంకట్, పురుషోత్తం, దావుద్, వినోద్, చెన్నయ్య, రాజు, ఆశన్న, రవి, మంగమ్మ, వెంకట్, రవి కిరణ్ పాల్గొన్నారు.

కళాశాలకు సొంత భవనం..



ఎమ్మెల్యే ఆనంద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న తహసీల్దార్ లక్ష్మీనారాయణ

అనంతగిరి: వికారాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనం నిర్మించాలని క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే ఆనంద్‌కు విద్యార్థులు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే.. వెంటనే కలెక్టర్ నారాయణరెడ్డితో మాట్లాడారు. జిల్లా కేంద్రంలో కళాశాల భవనం కోసం స్థల పరిశీలన చేయాలని కోరినట్లు విద్యార్థులు చెప్పారు.

ఎమ్మెల్యేను కలిసిన తహసీల్దార్

వికారాబాద్ మండల తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన లక్ష్మీనారాయణ మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌ను క్యాంపు కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

పల్లెల్లో పెరిగిన విద్యుత్ సమస్య

- పట్టించుకోని ట్రాన్స్‌కో అధికారులు
- సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఆగ్రహం
- క్రీడా ప్రాంగణాల బిల్లు రాలేదన్న సర్పంచ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

దౌల్తాబాద్: విద్యుత్ సమస్యలపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోవడం లేదని సర్పంచులు, ఎంపీటీసీలు ఆరోపించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ విజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు పలు సమస్యలను లేవనెత్తారు. కరెంట్ సమస్యలపై ట్రాన్స్‌కో అధికారులకు ఫోన్ చేస్తే నిర్లక్ష్య సమాధానం ఇస్తున్నారని మండిపడ్డారు. గ్రామాల్లో క్రీడాప్రాంగణాలు నిర్మించామని, ఇంతవరకు బిల్లులు రావడంలేదని సీటూరు సర్పంచ్ వెంకటయ్య సభ దృష్టికి తెచ్చారు.

బీఎల్‌ఓలు ఎవరో తెలియదు

రేషన్ కార్డులు మంజూరు కాకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నామని, దీనిపై సంబంధిత అధికారులు తగిన చర్యలు చేపట్టాలని సభ్యులు కోరారు. గ్రామాల్లో బీఎల్‌ఓ(బూత్‌లెవల్ ఆఫీసర్లు) ఎవరో కూడా చాలా మందికి తెలియక కొత్త ఓటరు కార్డులు నమోదు చేసుకోవడం లేదని దౌల్తాబాద్ సర్పంచ్ శిరీష ప్రస్తావించారు. దౌల్తాబాద్‌లో ఓ కాలనీకి తాగునీరు రావడంలేదని, దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఎంపీటీసీ మంజుల అన్నారు.

కళ్ల కలకతో జాగ్రత్త

రైతులకు ఉపాధిలో సబ్సిడీపై పండ్లతోటలను పెంచుకోవడానికి అవకాశం ఉందని, సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ రజనికాంత్ సూచించారు. రైతులకు సకాలంలో వేరుశనగ విత్తనాలను తెప్పించేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారి లావణ్యను సర్పంచులు కోరారు. ప్రస్తుతం గ్రామాల్లో కళ్ల కలక వ్యాపిస్తుందని, ప్రతి ఒక్కరు జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారి రతన్‌లాల్ సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మహిపాల్, వైస్‌ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, ఎంపీడీఓ తిరుమల స్వామి, డీటీ చాంద్‌పాషా, మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.